క్లుప్తంగా

ఆలిండియా స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జార్ఖండ్‌లో నిర్వహించిన 14వ జాతీయ స్కూల్ గేమ్స్ పోటీల్లో నెల్లూరుకు చెందిన పెంచల బాబు 80 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పతకాన్ని సాధించారు. దీనిపై డీఎస్డీఓ యతిరాజ్, కోచ్ సుకుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వాలీబాల్ విజేత కలువాయి జట్టు

కలువాయి: మండలంలోని కలువాయిలో మూడురోజులపాటు జరిగిన వాలీబాల్ పోటీల్లో కలువాయి యూత్ జట్టు విజేతగా నిలిచింది. అనంతసాగరం మండలం మంచాలపల్లి జట్టు రెండో స్థానంలో, పొదలకూరు జట్టు మూడో స్థానంలో నిలిచాయి. బహుమతుల కింద రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.2,500 అందజేసినట్లు నిర్వాహకుడు బి.నాగరాజు తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం కలువాయి ఎస్సై సుమన్, టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిశోర్‌రెడ్డి, చల్లా శివారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆత్మకూరు, అనంతసాగరం, కలువాయి, చేజర్ల, రాపూరు, పొదలకూరు మండలాలకు చెందిన 9 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

కామాక్షితాయి సేవలో..

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని మల్లికార్జున స్వామి కామాక్షితాయి అమ్మవారిని బెంగళూరుకు చెందిన ఐపీఎస్ అధికారి మువ్వా చంద్రశేఖర్, ఆయన సతీమణి ప్రీతి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.
➔ జొన్నవాడలోని మల్లికార్జునస్వామి, కామాక్షితాయిని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. వీరిని శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రిజిస్ట్రార్ ఆఫీస్ సెంటర్‌లో వాహనదారులకు కౌన్సెలింగ్‌ను ఎస్సై సంతోష్‌రెడ్డి సోమవారం నిర్వహించారు. రద్దీ సమయంలో ఆటోలను అడ్డంగా పెట్టి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. ద్విచక్రవాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు వీరిని కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

జగనన్నను మరోసారి సీఎం చేయడమే లక్ష్యం

ఇందుకూరుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టపర్చి.. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గంగపట్నంలో శ్రీనివాసులురెడ్డికి సత్కార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతను మూడోసారి అప్పగించిన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. తమ పాలన ఎలా సాగిందో.. ప్రస్తుతం ఎలా ఉందో ప్రజలకు వివరించాలని కోరారు. డీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, బట్టేపాటి నరేంద్రరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, ఎంపీపీ గంధళ్ల శంకరయ్య, నేతలు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, కొండూరు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా..



కోవూరు: కోవూరులోని కొత్తూరు డొంకలో సోమవారం జరిగిన ఎడ్ల పోటీలు తిలకించేందుకు వివిధ జిల్లాల నుంచి జనం పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. జనం కేరింతల నడుమ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. ప్రవాసాంధ్రులు, పక్క రాష్ట్రాల్లో ఉంటున్న వ్యాపారవేత్తలు, ఉన్నతోద్యోగుల సహకారంతో గెలుపొందిన ఎడ్ల జతలకు బంగారు కప్‌పాటు పారితోషికం అందజేశారు. నాలుగో స్థానంలో పాటూరుకు చెందిన ఎడ్ల జత నిలువగా రూ.15 వేలను వింతా కృష్ణారెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుమారులు అందజేశారు. వారికి కప్‌ను సాయం వరదయ్య జ్ఞాపకార్థం కుమారుడు ఆయన కృష్ణ చైతన్య కుటుంబసభ్యులు ఇచ్చారు. ఐదో స్థానంలో నెల్లూరు రంగానాయకులపేటకు చెందిన జత ఎడ్లు నిలువగా బహుమతిగా రూ.10 వేలను గడ్డం చిన్న వెంగళరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు అందజేశారు.

నేత్రపర్వంగా భోగి కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



విశేషాలంకారం

నెల్లూరు(బృందావనం): ధనుర్మాస వ్రతం పూర్తయిన సందర్భంగా నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో విశేష పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ప్రాకారోత్సవం.. గోదాదేవి, తల్పగిరి రంగనాథస్వామికి ఎదురుకోలు ఉత్సవం.. తదుపరి కల్యాణాన్ని కనులపండువగా జరిపారు. ఉభయకర్తలుగా కొండేటి పెంచలయ్య, లలితాకుమారి దంపతులు వ్యవహరించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం



సత్యసాయి మందిరంలో..

నెల్లూరు(బారకాసు): గోమతినగర్‌లోని సత్యసాయి మందిరంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణ మహోత్సవాన్ని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా సుధాకర్‌రెడ్డి, ప్రవీణమ్మ దంపతులు వ్యవహరించారు. తొలుత చిన్నారులపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. మందిర గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణ, సమితి కన్వీనర్ కొండా శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(అర్బన్): ఆకుతోటలోని లయన్స్ భవన్‌లో పేదలకు దుప్పట్లను సోమవారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు క్యాలెండర్ ఈవెంట్‌లో భాగంగా లయన్ మెల్విన్ జోన్స్ జయంతిని పురస్కరించుకొని వీటిని అందజేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు కార్యదర్శి చంద్రశేఖర్, క్లబ్ అధ్యక్షుడు మారుతిప్రసాద్, కోశాధికారి శ్రీనివాసులు, దాతలు కృష్ణమూర్తి, మురళీకృష్ణ, బసవయ్య, చంద్రశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాలలను మోసం చేసేందుకే వర్గీకరణ



కిలివేటి సంజీవయ్యకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాలలను మోసం చేసేందుకే ఎస్సీ వర్గీకరణకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని మాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర ఆరోపించారు. ఈ మేరకు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు వినతిపత్రాన్ని నగరంలోని ఆయన నివాసంలో సోమవారం అందజేశారు. వర్గీకరణను అడ్డుకునేందుకు తాము సాగిస్తున్న పోరాటానికి మద్దతివ్వాలని కోరారు. మాల ఉద్యోగుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి హరి, గౌరవాధ్యక్షుడు ఆదినారాయణ, బీటీపీ సంఘ వ్యవస్థాపకుడు రమణయ్య, రఘురామయ్య, గోడ రమణయ్య, లీగల్ సెల్ అధ్యక్షుడు మోహన్ అంబేడ్కర్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి దేవస్థానంలో పూజలు రేపు

నెల్లూరు(బృందావనం): సంక్రాంతిని పురస్కరించుకొని మూలాపేటలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మహా పూజను బుధవారం నిర్వహించనున్నామని దేవస్థాన కమిటీ చైర్మన్ గొల్ల సుబ్బారావు, కార్యనిర్వాహకుడు శేఖర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరుకు చెందిన యోగా గురువు స్వప్నకు డాక్టరేట్ లభించింది. యోగాను ఆధారంగా తీసుకొని పాఠశాలల విద్యార్థుల జీవన నైపుణ్యాలు, మానవ విలువలను మెరుగుపర్చడం అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. ఈ క్రమంలో బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టరేట్‌ను స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థ ఛాన్సలర్ నాగేంద్ర ప్రదానం చేశారు.

16న జాబ్ మేళా

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో జాబ్‌మేళాను ఈ నెల 16న నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భార్గవి ఆటోమొబైల్స్, ఎంజీ బ్రదర్స్, గాయత్రి ఇంటీరియర్స్, గోల్డ్ ఫీల్డ్స్ తదితర కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని, తగిన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10.30కు హాజరుకావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): పుష్య పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని సోమవారం నిర్వహించారు. పూజలను కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో జరిపారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పాల్గొన్నారు.

స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్‌లో సంబరాలు



నెల్లూరు(బారకాసు): చంద్రబాబునగర్‌లోని స్వర్ణదీపం చారిటుబల్ ట్రస్ట్‌లో సంక్రాంతి సంబరాలను సింహపురి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో కేవీఎస్ పెయింట్స్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులపై భోగి పండ్లు పోశారు. అనంతరం గాలిపటాలను ఎగురవేశారు.

వేడుకగా బదరికాశ్రమ జ్యోతిర్మఠ స్థాపన దినోత్సవం



లక్ష్మీనరసింహారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): శృంగేరి శారదాపీఠం, బదరికాశ్రమ జ్యోతిర్మఠ స్థాపన మహోత్సవాన్ని పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో సోమవారం నిర్వహించారు. ఉపన్యాసకుడిగా పోలవరపు లక్ష్మీనరసింహారావు హాజరయ్యారు. ట్రస్ట్‌కు రూ.రెండు లక్షలను నవులూరు అన్నపూర్ణమ్మ డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు. ధ్యాన మందిర నిర్వాహకుడు, చక్రాలవారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, వెంకటేశ్వరరావు, టీ వెంకటేశ్వరరావు, వెంకటశ్రీకాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా రంగవల్లుల పోటీలు



విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(బృందావనం): నగరంలోని డ్రైవర్స్ కాలనీలో గల ముత్యాలమ్మ గుడి వద్ద రంగవల్లుల పోటీలను సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక, వరపరివార్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. సత్యనారాయణ శర్మ, డాక్టర్ మారం సుధాకర్, కౌశల్, పురుషోత్తం యాదవ్, మల్లవరం గీతాకృష్ణ, నిర్వాహకులు దగ్గుపాటి రాధాకృష్ణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో భోగి సంబరాలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో భోగి సంబరాలను స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాబోలు సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేశారు. చిన్నారులపై పండ్లు పోసి ఆశీర్వదించారు. వాకర్స్‌కు పండ్లు పంపిణీ చేశారు. దాతగా బెజవాడ సునీల్ వ్యవహరించారు. పాబోలు సత్యం, స్నేహ సురేష్, రఘురామ్ ముదిరాజ్, రంగారావు, రమేష్, హరి, సాయి, కిలారి తిరుపతినాయుడు, దద్దోలు రమణయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుందరేశ్వరుడికి రుద్రాభిషేకం



నెల్లూరు(బృందావనం): ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో విశేష పూజలను రాజరాజేశ్వరి, రంగనాథ భక్తమండలి కమిటీల సౌజన్యంతో సోమవారం నిర్వహించారు.
దేవస్థాన ప్రాంగణంలో కొలువైన మీనాక్షి సుందరేశ్వరస్వామికి 108 లీటర్ల తేనెతో రుద్రాభిషేకం చేశారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. మెంటా రామ్మోహన్‌రావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మేమింతే.. మారమంతే



రహదారి నియమ నిబంధనలపై పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నా.. రోడ్డు ప్రమాదాలు కళ్లముందే కనిపిస్తున్నా...కొందరు వాహనదారుల్లో మార్పు రావడం లేదు. ట్రాఫిక్ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ నగర రహదారులపై రయ్.. రయ్ అంటూ దూసుకెళ్తున్నారు. ద్విచక్రవాహనాలపై ట్రిపుల్ రైడింగ్ సాగిస్తున్నారు. వీరిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నెల్లూరు(క్రైమ్)







ఆనందోత్సాహాలతో భోగి

భోగభాగ్యాల భోగి పండగను ఆనందోత్సాహాలతో సోమవారం జరుపుకొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వేకువజాము నుంచి ప్రజలు పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. సంక్రాంతిని మంగళవారం ఘనంగా జరుపుకొనేందుకు ఇంటిల్లిపాది సన్నద్ధమయ్యారు. కనుమను బుధవారం జరుపుకోనున్నారు.

– నెల్లూరు(బృందావనం)



జయమ్మకు సత్కారం



నెల్లూరు(బారకాసు): భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలో పనిచేస్తున్న వనపర్తి జయమ్మ, ఆమె భర్త రమేష్ సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్రపతి పురస్కారానికి ఆహ్వానించడాన్ని బీజేపీ నేత మిడతల రమేష్ అభినందించారు. జయమ్మను నగరంలోని ఆమె నివాసంలో సత్కరించారు. నరాల సుబ్బారెడ్డి, పైడిమాని ఆదినారాయణ, నీలిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వర్షం

నగరంలో సోమవారం ఉదయం ఉన్నట్టుండి వర్షం కురిసింది. ఈ పరిణామంతో భోగి మంట వేయాలనుకున్న పలువురు నిరుత్సాహానికి గురయ్యారు. వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్



